క్లుప్తంగా

ధీర ఫౌండేషన్ ఆపన్న హస్తం



ఆర్థిక సాయం చేస్తున్న బొత్స సందీప్

విజయనగరం: పట్టణానికి చెందిన ధీరా ఫౌండేషన్ అధ్యక్షుడు బొత్స సందీప్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. నగరంలోని లంకవీధి ప్రాంతానికి చెందిన రామిరెడ్డి వాసు గత కొంతకాలంగా అనారోగ్యంతో తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ కోసం రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద అయిన వాసు వద్ద చికిత్సకు అవసరమైన డబ్బులు లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ధీర ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బొత్స సందీప్ వాసుకు వైద్యం అందిస్తున్న డాక్టర్లతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అదేవిధంగా వైద్య ఖర్చుల కోసం బాధితుడి భార్య రామిరెడ్డి శ్రీవల్లికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

భూముల రీసర్వే ప్రారంభం



సర్వే చేస్తున్న సిబ్బంది

సంతకవిటి: మండల పరిధిలో భూముల సమగ్ర రీసర్వేని ప్రారంభించినట్లు మండల సర్వేయర్ మరిపి ఈశ్వరసత్యనారాయణ తెలిపారు. మండలంలో శ్రీహరినాయుడుపేట గ్రామంలో సోమవారం భూముల రీసర్వే చేపట్టారు. రైతుల సమక్షంలోనే సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు సర్వేకు సహకరించాలని కోరారు.

నూకాలమ్మను దర్శించుకున్న మేయర్



నూకాలమ్మకు పూజలు చేస్తున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: సకల జగాలను ఏలే నూకాలమ్మ ఆశీస్సులు ప్రతీ ఒక్కరిపైన ఉండాలని నగర మేయర్ విజయలక్ష్మి కోరుకున్నారు. నగరంలోని కర్రల మార్కెట్ వద్ద ఉన్న నూకాలమ్మ ఆలయాన్ని సోమవారం సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆమెకు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

విత్తనగుళికలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: విత్తనగుళికలు రూపంలో విత్తనాలు వేసుకోవడం ద్వారా వాటిని పక్షులు తినకుండా ఉంటాయని, వర్షాలు కురిసినపుడు మొలకలు వస్తాయని ఏపీసీఎన్ఎఫ్ రీజినల్ సాంకేతిక అధికారి ప్రకాష్ అన్నారు. మండలంలోని గుంకలాం గ్రామంలో సోమవారం విత్తనగుళికల తయారీ, ప్రధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన గుళికల ద్వారా మెట్టు ప్రాంత రైతులకు మేలు జరుగుతుందన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



మట్లాడుతున్న ఎంపీడీఓ దాసరి బంగారయ్య

భోగాపురం: నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా మారుతుందని ఎంపీడీఓ దాసరి బంగారయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాలను సాగు ఆవశ్యకత, విత్తనశుద్ధి విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, ఏపీఓ రమణ, ఏపీఎం ఆదిబాబు, ఎంఈఓ రమణమూర్తి, ఎఫ్పీఓ సమాఖ్య మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

విజయనగరం: ప్రాపర్టీ టాక్స్ చెల్లింపు, వడ్డీ మాఫీ పథకంపై నగరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, రెవెన్యూ అధికారులు పాల్గొని పన్ను చెల్లింపుదారుల సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



డెంకాడ: చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను ప్రదర్శిస్తున్న పొదుపు సంఘాల మహిళలు



నెల్లిమర్ల: చిరుధాన్యాలతో చేసిన తినుబండారాల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు



నెల్లిమర్ల: ప్రథమ బహుమతి అందుకుంటున్న రామతీర్థం వీఓఏ మనోజ

నెల్లిమర్ల: ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పందవచ్చని ఎంపీడీఓ జి.గిరిబాల, తహసీల్దార్ కేవీ రమణరాజు అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మిల్లెట్స్ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఉత్తమ వంటలు తయారు చేసిన వారికి అధికారులు బహుమతులు అందజేశారు. అనంతరం చిరుధాన్యాల ప్రాధాన్యతలను వివరించారు. రక్తపోటు, మధుమేహం, తదితర దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు వైద్యుల సలహామేరకు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా మెరుగైన ఫలితం ఉంటుందన్నారు. వాటితో ఎలాంటి వంటకాలు చేసుకోవచ్చో మహిళలు వివరించారు.



డెంకాడ: విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

డెంకాడ: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మిల్లెట్స్ మహోత్సవాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలు చిరుధాన్యాలతో వివిధ రకాల తినుబండారాలను తయారు చేసి ప్రదర్శించారు. వాటిలో ఉత్తమ పదార్థాలను ఎంపిక చేసి అధికారులు బహుమతులు అందజేశారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఎంపీడీఓ స్వరూపారాణి, వ్యవసాయాధికారి పూడి నిర్మల, ఏపీఎం విజయలక్ష్మి, తదితరులు వివరించారు. పోటీల్లో గెలుపొందిన వారిలో ముగ్గురిని జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు చెప్పారు.

నోటి శుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ వేదవతి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

నెల్లిమర్ల: నోటిని పరిశుభ్రతంగా ఉంచుకోవడం ద్వారా చాలావరకు వ్యాధులు ధరిచేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నెల్లిమర్ల సామాజిక ఆరోగ్య కేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా పట్టణంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దంతాల సంరక్షణ, నోటి పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని, ఆహారం తినక ముందు, తిన్న తర్వాత నోటిని శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అలాగే ప్రతీ మూడు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుబ్రహ్మణ్యం హరికిషన్, వినోద్ లాల్వాణి, లోకేష్‌రెడ్డి, సీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నోటి శుభ్రతపై దృష్టిపెట్టాలి

విజయనగరం ఫోర్ట్: నోటి శుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని తిరుమల మెడికవర్ ఆస్పత్రి దంత వైద్యులు ఎస్.వి.వి.వేదవతి అన్నారు. ఆస్పత్రిలో సోమవారం విద్యార్థుల కోసం దంత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు చేశారు. దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి హెడ్ పద్మకుమార్, ఏఓ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

- ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఆస్మా ఫరీన్



సదస్సులో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఆస్మా ఫరీన్

నెల్లిమర్ల: మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, యువత వాటికి దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అదనపు ఎస్పీ ఆస్మా ఫరీన్ హెచ్చరించారు. పట్టణంలోని మిమ్స్ వైద్య కళాశాలలో ఎస్ఈబీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆస్మా ఫరీన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మద్యం, గంజాయి, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ పూర్తిగా అంధకారమవుతుందని, ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ఎస్ఈబీ సీఐ రాజశేఖరనాయుడు, నెల్లిమర్ల ఎస్సై నారాయణరావు వీడియో ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేస్తున్న సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. స్థానిక కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు సోమవారం జామెట్రీ బాక్సులు, అట్టలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని, తల్లిదండ్రుల ఆశలను నిజం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.కాంచన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం

విజయనగరం క్రైమ్: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సచివాలయ వలంటీర్లకు అగ్నిమాపకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. స్థానిక కణపాత యూత్ హాస్టల్‌లో సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన వలంటీర్లకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.కోట అగ్నిమాపక శాఖాధికారి మదీనా, విజయనగరం ఏఎస్ఎఫ్ఓ కె.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రమాదం జరిగినపుడు ఆందోళన చెందకుండా అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడొచ్చన్నారు.



గ్యాస్ సిలెండర్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రభుత్వంపై ఆరోపణలు సరికాదు

విజయనగరం ఫూల్‌బాగ్: బీసీ సంఘాల నాయకులు లాకా వెంగలరావు, నూకాలమ్మ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బొద్దాన అప్పారావు, యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు గదుల సత్యలత యాదవ్ హెచ్చరించారు. స్థానిక సంఘం భవనంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేశారన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లను నియమించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా బీసీల కోసం ఇంతలా పనిచేయలేదని గుర్తుచేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భోగాపురం: భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ, హెల్పర్ పోస్టులకు అర్హులైన మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ సీడీపీఓ తవిటినాయుడు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. భోగాపురం మండలం జగ్గయ్యపేట, చినకొండ్రాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, భోగాపురం మండలం దల్లిపేట, గాలిపేట, డెంకాడ మండల గువ్విపేట, పూసపాటిరేగ మండలం కొత్తనడిపిల్లి, పెదబత్తివలస, బోరపేట వెల్దూరు, రీసుపేట మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే డెంకాడ మండలం మోపాడ–2 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అన్ని పోస్టులను ఓపెన్ కేటగిరి కింద భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి, పదో తరగతి పాసై, స్థానికంగా నివాసం ఉంటున్న మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలి.

హమాలీల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న హమాలీలు

విజయనగరం అర్బన్: సివిల్ సప్లయ్ హమాలీల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం హమాలీలు చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని 8 ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు సక్రమంగా వేతనాలు అందివ్వడం లేదన్నారు. మృతి చెందిన హమాలీల పీఎఫ్ డబ్బులను వారి కుటుంబ సభ్యులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లాన సత్యనారాయణ, అధ్యక్షుడు ముల్లు నరసింహులు, జిల్లా కార్యదర్శి పురం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శ్రీరామనవమి మహోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 22 నుంచి 31 వరకు శ్రీరామ వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నామని ఎన్‌సీఎస్ ఛారిటబుల్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మహోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 30న శ్రీరామ నవమి పర్వదిన సందర్భంగా సీతారాములకు పంచామృతభిషేకం, సాయంత్రం స్వామివారి కల్యాణం ఉంటాయన్నారు. అలాగే 31న ఉదయం 9 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం, సాయంత్రం 7 గంటలకు ఊంజల్‌సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



సావిత్రి ఘడియారామ్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

డెంకాడ: నేటి తరం అవసరాలకు తగ్గట్లు కంప్యూటర్ సైన్సు ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని హైదరాబాద్‌కు చెందిన జీటిక్నో ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్ హ్యూమన్ రోసోర్సు మేనేజర్ సావిత్రి ఘడియారామ్ అన్నారు. జొనాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్సు విభాగం స్టూడెంట్ అసోసియేషన్ 'ఉత్కర్ష్' వార్షికోత్సవం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కంపెనీల అవసరాలను తగ్గట్టు నైపుణ్యాలు మెరుగు పరచుకుంటే ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. ముఖ్యంగా కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి, చైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రెటరీ కె.శివరామకృష్ణ తదితరులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ టి.హరిబాబు, ఏవీ పరాంకుశం, డీన్ జి.ప్రకాష్‌బాబు, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రాజేశ్వరావు

విజయనగరం ఫోర్ట్: క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే కఫం పరీక్ష చేయించుకోవాలని టీబీ సూపర్‌వైజర్ జె.రాజేశ్వరావు సూచించారు. స్థానిక అర్అండ్‌బీ రైతుబజార్‌లో సోమవారం క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్సపై రైతులకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు పైగా కఫంతో కూడిన దగ్గు, జ్వరం ఉన్నట్లయితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణ, చికిత్స అందుబాటులో ఉందన్నారు. రోగి తుమ్మినపుడు, దగ్గినపుడు రుమాలుగానీ, చేయిగానీ అడ్డుగా పెట్టుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా 6 నెలల పాటు మందులు వాడితే వ్యాధి నుంచి పూర్తిగా బయటపడవచ్చన్నారు. క్షయ రోగులందరూ హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి చప్ప సతీష్‌కుమార్, ఆర్.సంచిత్, గోవింద తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు కొత్తరూపు

- నగరంలోని ప్రధాన కూడళ్ల సుందరీకరణ
- రూ.4.45 లక్షలతో బాలాజీ జంక్షన్ అభివృద్ధికి చర్యలు



బాలాజీ జంక్షన్ వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులు

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరం కొత్తరూపు సంతరించుకుంటోంది. రాష్ట్రంలోని ఇతర నగరాలతో పోటీపడేలా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే నగరంలోని పలు కూడళ్లను అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు. తాజాగా బాలాజీ జంక్షన్‌లో రూ.4.50 లక్షలతో సుందరీకరణ పనులు చేపడుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో పదవుల కోసం వెంపర్లాడిన పాలకులు విజయనగరం నగరాభివృద్ధిని గాలికొదిలేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నగరాభివృద్ధిని పట్టాలెక్కించింది. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసేలా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవతీసుకున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లను ఒక్కొక్కటిగా సుందరీకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఎత్తుబ్రిడ్జి సమీపంలోని రాజీవ్‌గాంధీ జంక్షన్ వద్ద రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఓపెన్ అక్వేరియాన్ని ఏర్పాటు చేశారు. దాసన్నపేట రైతుబజారు జంక్షన్ వద్ద మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం, కొత్తపేట నీళ్ల ట్యాంకు జంక్షన్ వద్ద రాధాకృష్ణ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రూ.4.50 లక్షలతో బాలాజీ జంక్షన్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ జంక్షన్ మధ్యలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం చుట్టూ గ్రానైట్‌తో గోడ నిర్మించి, చుట్టూ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రెయిలింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను 25 రోజుల్లో పూర్తిచేయాలని నిర్ణయించారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: నగరానికి చెందిన మహిళల నుంచి 'ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023' పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు సోమవారం తెలిపారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, పెరటి మొక్కల సాగు, మిద్దె తోటల పెంపకం, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల తయారీ, సాంకేతిక ఆవిష్కరణలు, తదితర విభాగాల్లో కృషిచేస్తున్న స్వయం సహాయక బృందాలు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌జీఓతకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 22వ తేదీలోగా కార్పొరేషన్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉగాది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్యామ్‌సుందర్, తదితరులు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రోగ్రామింగ్ కన్వీనర్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. ఉగాది వేడుకలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన ప్రముఖ పండితులు రాళ్లపల్లి రామసుబ్బారావుతో పంచాంగ పఠనం, రామాయణ సప్తహ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ నెల 30 వరకు రామాయణ సప్తాహ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అలాగే పార్వతీపురంలో పొందూరు సుధాకుమార్‌తో పంచాంగ పఠనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవకీనందన్, అర్చకులు పీవీ.నరసింహాచార్యులు, ఎస్.రంగారావు, జి.తిరుపతిరావు, సిహెచ్.కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి అరుణకుమారి

విజయనగరం రూరల్: ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మండల స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి ఎం.అరుణకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. సమస్యల పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కానట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని అర్జీదారులతో అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింతా బంగార్రాజు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కెమెస్ట్రీతో ఉద్యోగావకాశాలు మెండు



శ్రీనివాసరావుకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్

విజయనగరం అర్బన్: రసాయనశాస్త్రంలో పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'స్టిరియో కెమిస్ట్రీ' అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రసాయనశాస్త్రం అభ్యసించే విద్యార్థులుకు ఫార్మా, బయోటెక్, తదితర కంపెనీల్లో ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు సబ్జెక్టుపై పట్టుసాధించాలని సూచించారు. అనంతరం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుభ ఆయన్ను సత్కరించారు.

పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి

విజయనగరం క్రైమ్: పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చిన ముగ్గురు యువకులు పెట్రోల్ పోయించుకున్న తర్వాత డబ్బులు చెల్లించకుండా పరారయ్యేందుకు యత్నించారు. అడ్డుకున్న సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. బంకు సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అక్కడకు చేరుకున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై జిల్లా పెట్రోల్ బంకుల యాజమాన్య అసోసియేషన్ అధ్యక్షుడు జి.నాగిరెడ్డి సోమవారం మాట్లాడుతూ.. ఇటీవల ఇటువంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని, దీనిపై పోలీసుశాఖ దృష్టి సారించి పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.